నమస్తే తెలంగాణ
నిర్మల్
3 | నిజామాబాద్, శనివారం 17 ఫిబ్రవరి 2024 | NIRMAL

## రైతుబంధు వెంటనే అందించాలి

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్


సహకార సంఘం భవనాన్ని ప్రారంభిస్తున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

ఇచ్చోడ, ఫిబ్రవరి 16 : రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు గడుస్తున్నా, రైతు బంధు ఇంకా రాక, రైతులు ఇబ్బంది పడుతున్నారని, వెంటనే అందించాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఇచ్చోడ మండల కేంద్రంలోని గంగారెడ్డి గార్డెన్ పక్కన నిర్మించిన నూతన వ్యవసాయ సహకార సంఘం భవనాన్ని ఎమ్మెల్యే శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఈ భవనాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, ఎంపీపీ నిమ్మల ప్రీతం రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఏనుగుల కృష్ణారెడ్డి, ఉప సర్పంచ్ శిరీష్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా అద్దాల మేడ ప్రారంభోత్సవం

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 16: జిల్లా కేంద్రంలోని శ్రీనవ శక్తి దుర్గా మాత ఆలయ ప్రాంగణంలో నిర్మించిన అద్దాల మేడ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. శుక్రవారం రథ సప్తమి సందర్భంగా ఉదయం నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించి, అద్దాల మేడలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు కిషన్ మహారాజ్ నేతృత్వంలో వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు. మాజీ మంత్రి జోగు రామన్న ఆలయాన్ని దర్శించుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పండితులు మంత్రోచ్ఛారణల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

# కేంద్రంపై కన్నెర్ర

- వ్యతిరేక చట్టాలు రద్దు చేయాలని డిమాండ్
- ఆదిలాబాద్, నిర్మల్ కలెక్టరేట్ల ఎదుట ధర్నా
- బీఆర్ఎస్ మద్దతు

### వివిధ కార్మిక సంఘాల నిరసనలు


నిర్మల్ జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

ఆదిలాబాద్, ఫిబ్రవరి 16 (నమస్తే తెలంగాణ): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా గ్రామీణ భారత్ బంద్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా కార్మిక సంఘాలు, వివిధ రాజకీయ పార్టీలు ఆందోళనలు నిర్వహించాయి. ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమానికి మాజీ మంత్రి జోగు రామన్న హాజరయ్యారు. కేంద్ర ప్రభుత్వం వైఖరిని కార్మిక సంఘాల నేతలు తీవ్రంగా ఖండించారు. కార్మికులు, సంఘాలు ఎన్నో ఏళ్ల పాటు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను మోదీ ప్రభుత్వం రద్దు చేయడం సరికాదన్నారు. కార్మికులకు ప్రయోజనం చేకూర్చే చట్టాలను పునరుద్ధరించాలని, కేంద్రాన్ని కోరినా ఎలాంటి ఫలితం లేదని మండిపడ్డారు. కేంద్రం ప్రభుత్వ రంగం సంస్థలను ప్రైవేటుపరం చేయడంతో లక్షలాది మంది కార్మికులు రోడ్డున పడుతున్నారని కార్మిక సంఘాల నేతలు తెలిపారు. ఈ పదేళ్లలో కనీస వేతనాలు లేవని, కార్మికులకు ఉద్యోగ భద్రత కరువైందని విమర్శించారు. గ్రామాల్లో ఈజీఎస్ నిధులు తగ్గించడంతో కూలీలకు ఉపాధి కూడా లభించడం లేదని తెలిపారు. నిరుద్యోగులకు ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తానని చెప్పి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం, అ తర్వాత ఆ దిశగా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవన్నారు. భవన నిర్మాణ రంగం కార్మికులకు రూ.10 వేల పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

**మోదీ కార్మిక, రైతు వ్యతిరేకి: మాజీ మంత్రి జోగు**

ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం రైతు, కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నదని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. కార్మికుల ఆందోళనకు బీఆర్ఎస్ కార్మిక విభాగం మద్దతు పలుకగా కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ఆందోళనలో ఆయన పాల్గొన్నారు. గత పదేళ్లలో దేశంలో ఎన్నో ప్రభుత్వ రంగ సంస్థ లు మూతపడ్డాయని తెలిపారు. 5 వేల మం దికి ఉపాధి కల్పించే ఆదిలాబాద్ సిమెంటు పరిశ్రమను కేంద్రం ఎందుకు ప్రారంభించడం లేదని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా కార్మికులు, రైతులు చేపట్టే ఆందోళనకు తమ మద్దతు ఉంటుందని తెలిపారు.

**నిర్మల్ జిల్లాలో..**

నిర్మల్ టౌన్.ఫిబ్రవరి 16: కేంద్ర ప్రభు త్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్మల్‌లో కార్మిక సంఘాల నేతలు కార్మికులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. నిర్మల్‌లో సీఐటీయూ, ఏఐటీయూసీ. మున్సిపల్ కార్మికులు, మధ్యాహ్న భోజన, కార్మికులు, అంగన్‌వాడీలు, ఆశవర్కర్లు, హమాలీ, ఆటో, బస్సు యూనియన్, బీఎస్ఎన్ఎల్ తెలంగాణ వ్యవసాయ కార్మికసంఘం, జీపీ తదితర కార్మిక సంఘాల నాయకులు సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ర్యాలీలు నిర్వహించి వినతి పత్రాలను అధికారులకు అందించారు. రైల్వే సాధన కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులతో ర్యాలీ తీశారు. ఆర్డీవో కార్యాలయం వద్ద జాతీయ రహదారిపై మానవహారం చేపట్టారు. సీపీఎం నేత రాములు, కార్మిక సంఘాల నాయకులు రాజన్న, సురేశ్, రాంలక్ష్మణ్, శ్రీనివాస చారి, ఎస్ఎన్ రెడ్డి, నూతన్ కుమార్, నరేందర్ గౌడ్, ఎంసీ లింగన్న, మనోజ్ కుమార్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

**కలెక్టరేట్ ఎదుట ధర్నా**

ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని తదితర డిమాండ్లతో టీఎన్‌జీవో ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ మాట్లాడుతూ ఉద్యోగులకు ఆదాయపు పన్ను నుంచి మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాయకులు రవికుమార్, మోహన్ రెడ్డి, సుజయ్ తదితరులు పాల్గొన్నారు.


కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న టీఎన్‌జీవో ఉద్యోగులు


ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట సమ్మెలో అభివాదం చేస్తున్న రైతు నాయకులు, మాజీ మంత్రి జోగు రామన్న


ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన సమ్మెలో పాల్గొన్న కార్మికులు

## ముగిసిన నాగోబా జాతర

- కిక్కిరిసిన ఆలయ పరిసరాలు
- మరో రెండు రోజులు సందర్శనకు రానున్న భక్తులు


నాగోబా దర్శణానికి బారులు తీరిన భక్తులు

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి16: మండలంలోని కెస్లాపూర్‌లో నిర్వహించే నాగోబా జాతర శుక్రవారం ముగిసింది. ఆఖరు రోజు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఫిబ్రవరి 9న అర్ధరాత్రి మెస్రం వంశీయుల మహాపూజలతో నాగోబా జాతర ప్రారంభమవగా, శుక్రవారం వరకు సుమారు 4లక్షలకు పైగా భక్తులు దర్శించుకున్నట్లు ఈవో రాజమౌళి తెలిపారు. అయితే మరో రెండు రోజుల పాటు కూడా భక్తులు వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు.


పూజలు చేస్తున్న మెస్రం వంశీయ మహిళలు

## పాప వైద్యం కోసం వస్తే..

- మహిళ చైన్ స్నాచింగ్
- దొంగను పట్టుకున్న స్థానికులు

ఎదులాపురం, ఫిబ్రవరి 16: మహారాష్ట్రకు చెందిన ఓ మహిళ తన పాప వైద్యం కోసం ఆదిలాబాద్‌కు వస్తే చైన్‌స్నాచింగ్‌కు గురైంది. ఆదిలాబాద్ వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ కథనం ప్రకారం.. మహారాష్ట్రలోని యావత్‌మాల్ జిల్లా బండల కారేగావ్‌కు చెందిన కంచెన అన్నపూర్ణకు కొన్నేళ్ల క్రితమే భర్త మృతి చెందాడు. కూలీగా పని చేస్తూ పాపను పోషించుకుంటున్నది. ఈ క్రమంలో పాపకు ఆరోగ్యం బాగా లేకపోవడంతో శుక్రవారం ఉదయం ఆదిలాబాద్ బస్టాండ్ సమీపంలోని ఒక ప్రైవేటు దవాఖానకు వచ్చింది. వైద్యం అనంతరం అంబేద్కర్ చౌక్ గుండా బస్సులు ఆగే ఠాకూర్ హోటల్ వైపు నడుస్తూ వెళ్తున్నది. ఈ క్రమంలో శివాజీ చౌక్ ప్రాంతంలో ఇద్దరు ఆగంతకులు ఆమె మెడలోని తులం బంగారు గొలుసును తెంపి పారిపోయే ప్రయత్నం చేశారు. ఆమె కేకలు వేయడంతో, స్థానికులు వెంటనే స్పందించి ఒకడిని పట్టుకున్నారు. ఈ క్రమంలో గొలుసు కింద పడింది. మరొక దుండగుడు పారిపోయాడు. పట్టుకున్న దొంగను స్థానికులు, బంధువులు దేహశుద్ధి చేసి వన్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. సీఐ ఆధ్వర్యంలో ఎస్ఐ సాయన్న, సిబ్బంది విచారణ చేయగా ఆదిలాబాద్ పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన ఆత్రం రోహిత్, వరలక్ష్మీ నగర్‌కు చెందిన అర్షద్‌గా గుర్తించారు. అర్షద్ ప్రస్తుతం పరారీలో ఉన్నాడని, త్వరలో పట్టుకుంటామని తెలిపారు.

## పంట రక్షణ చర్యలు తీసుకోవాలి

- ఐటీడీఏ ఉద్యానవన అధికారి సందీప్ కుమార్


సూచనలు చేస్తున్న సందీప్ కుమార్

ఉట్నూర్, పిబ్రవరి 16 : మామిడి, జామ తోటల్లో పంట రక్షణకు చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ ఉద్యానవన అధికారి సందీప్ కుమార్ సూచించారు. ఐటీడీఏ పరిధిలోని నర్సరీ, శిక్షణా కేంద్రాన్ని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండ్ల తోటల అభివృద్ధికి వాతావరణం అనుకూలంగా ఉందని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. పంటలు, పండ్ల మొక్కలు నీటి ఎద్దడిని తట్టుకునేలా చూడాలన్నారు. ఉద్యాన వన అధికారి సుధీర్ కుమార్, సాంకేతిక సహాయకులు అర్జిత, పూజ పాల్గొన్నారు.

## ఆటో జప్తు..ఆదుకున్న డాక్టర్

- వాహనాన్ని లాక్కెళ్లిన ఫైనాన్స్ సిబ్బంది

నిర్మల్ అర్బన్/లక్ష్మణచాంద, ఫిబ్రవరి 16: నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలంలో ఓ ఇద్దరు మహిళలకు చెందిన ఆటో కిస్తు కట్టకపోవడంతో ఫైనాన్స్ సిబ్బంది లాక్కెళ్లారు. దీంతో వారికి రూ.57వేలు సహాయం అందించి ఉదారత చాటుకున్నాడు నిర్మల్ పట్టణానికి చెందిన డాక్టర్ రమేశ్ రెడ్డి. లక్ష్మణచాంద మండలంలోని చామన్‌పెల్లి గ్రామానికి చెందిన కరుణ, మంజుల బతుకుదెరువుకోసం స్త్రీనిధి రుణంతో పాటు కొంత ఫైనాన్స్ కలుపుకొని ఆటోను కొనుగోలు చేశారు. ఆటో కిస్తీ చెల్లించడం వారికి భారంగా మారింది. దీంతో ఫైనాన్స్ కంపెనీ సిబ్బంది ఆటోను లాక్కెళ్లారు. సమాచారం తెలుసుకున్న ప్రముఖ వైద్యుడు డాక్టర్ రమేశ్‌రెడ్డి వారికి శుక్రవారం తన దవాఖానలో రూ. 57వేల ఆర్థిక సహాయం అందించారు. ఆటోను విడిపించుకోవాలని సూచించారు.


పేద కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న డాక్టర్ రమేశ్ రెడ్డి

# మిగిలింది 12 రోజులే..

### సీఎంఆర్ అందజేసేందుకు ఈ నెల 29న గడువు

- రావాల్సింది 28 వేల మెట్రిక్ టన్నులు
- ఇప్పటి వరకు 17 మిల్లుల కోటా పూర్తి
- 44 మిల్లులు అసంపూర్తి


దేగాం రైస్‌మిల్లులో రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

నిర్మల్, ఫిబ్రవరి 16(నమస్తే తెలంగాణ): ప్రభుత్వం రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధరను కల్పిస్తూ ఐకేపీ, పీఏసీఎస్ లాంటి పభుత్వ సంస్థల ద్వారా కొనుగోలు చేయిస్తున్నది. వాటిని మిల్లింగ్ చేసేందుకు జిల్లాలోని ప్రైవేటు రైస్ మిల్లులకు అందజేస్తున్నది. అయితే గడువులోగా ఆయా మిల్లర్లు ధా న్యాన్ని మిల్లింగ్ చేసి నిబంధనల మేరకు తిరిగి ప్రభుత్వానికి అందజేయాల్సి ఉంటుంది. కానీ చాలా మంది అలా చేయడం లేదు.

**గడువులోగా సాధ్యమేనా...?**

జిల్లాలో 2022-23 వానకాలం సీజన్‌కు సంబంధించి రైతుల నుంచి 1,68,000 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఈ ధాన్యాన్ని జిల్లాలోని 60 పారాబాయిల్డ్, బిన్ని రైస్ మిల్లులకు మిల్లింగ్ చేసేందుకు కేటాయించింది. మిల్లింగ్ అనంతరం రా రైస్ అయితే 67శాతం, బాయిల్డ్ రైస్ అయి తే 68శాతం చొప్పున తిరిగి ప్రభుత్వానికి అందించాల్సి ఉన్నది. అయితే ఈ ఏడాది సీఎంఆర్ లక్ష్యం చేరుకోవడం కష్టమేనని తెలుస్తున్నది. ధాన్యాన్ని మిల్లింగ్ చేసిన అనంతరం పర్సంటేజీ ప్రకారం ప్రభుత్వానికి 1,12,000 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సివిల్ సప్లై శాఖ సేకరించాల్సి ఉన్నది. ఇటీవలే జిల్లా కలెక్టర్ ఆశిష్‌సంగ్వాన్ సంబంధిత శాఖ అధికారులతో సీఎంఆర్ సేకరణపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ నెల 29లోగా అందజేయని మిల్లర్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అయితే గడువు 12 రోజులు మాత్రమే ఉండగా, ఇంకా 28 వేల మెట్రిక్ టన్నుల బియ్యం రావాల్సి ఉన్నదని అధికారులు చెబుతున్నారు. ఇప్పటి వరకు 17 మిల్లుల నుంచి మాత్రమే పూర్తి స్థాయిలో బియ్యం వచ్చిందని, ఇంకా 43 మిల్లుల నుంచి రావాల్సి ఉందని సమాచారం.


కలెక్టరేట్‌లో సీఎంఆర్‌పై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

**మిల్లుల్లో ధాన్యం మాయం...**

జిల్లాలో 20-30శాతం సీఎంఆర్ మాత్రమే అందజేసిన మిల్లులు 20 వరకు ఉండగా, 50-60శాతం పూర్తి చేసిన మిల్లులు 23 వరకు ఉన్నాయి. 2022-23 వానకాలం సీజన్‌కు సంబంధించి పరిస్థితే ఇలా ఉంటే అంతకు ముందు కూడా జిల్లాలో దాదాపు 20కు పైనే మిల్లుల నుంచి వందల కోట్ల రూపాయల సీఎంఆర్ పెండింగ్ ఉన్నట్లు సమాచారం. గతేడాది యాసంగికి సంబంధించి మిల్లుల నుంచి బియ్యం తక్కువగా వచ్చినప్పటికీ సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం సీఎంఆర్ కోసం ఇచ్చిన నాణ్యమైన ధాన్యాన్ని బహిరంగ మార్కెట్‌లో అమ్ముకుంటున్న కొందరు మిల్లర్లు.. పీడీఎస్ బియ్యాన్ని రీ సైక్లింగ్ చేసి సీఎంఆర్ కింద పంపుతున్నట్లు పెద్ద ఎత్తున ఆరోపణలు వినిపిస్తున్నాయి. పేదల బియ్యాన్ని కొందరు అక్రమార్కులు కొనుగోలు చేసి మిల్లులకు సరఫరా చేస్తున్నట్లు తెలుస్తున్నది. ఇలా తక్కువ ధరకు సేకరించిన బియ్యాన్ని రీ సైక్లింగ్ చేసి సీఎంఆర్‌గా చూపుతున్నారు. సీజన్‌లో వచ్చే ధాన్యాన్ని బహిరంగ మార్కెట్‌లో విక్రయించుకొని సీఎంఆర్ గడువు ముగిసే సమయంలో పీడీఎస్ బియ్యాన్ని సేకరించి అధికారులను మేనేజ్ చేస్తూ లక్ష్యం పూర్తి చేసినట్లుగా చూపిస్తున్నట్లు సర్వత్రా ఆరోపణలున్నాయి.

## సాధారణ ప్రసవాలు పెంచాలి

- నిర్మల్ డీఎంహెచ్‌వో ధన్‌రాజ్


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో ధన్‌రాజ్

నిర్మల్ చైన్‌గేట్, ఫిబ్రవరి 16: దవాఖానల్లో ప్రసవాలను పెంచాలని నిర్మల్ డీఎంహెచ్‌వో ధన్‌రాజ్ అన్నారు. జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో ప్రైవేటు దవాఖానల వైద్యులతో సీ సెక్షన్ ప్రసవాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ సిజేరియన్లు తగ్గించాలని ప్రైవేటు దవాఖానల వైద్యులకు కొంతకాలంగా చెబుతున్నప్పటికీ, అనుకున్న ఫలితాలు రావడం లేదన్నారు. ఇకపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో ఎంటీపీ నిర్వహిస్తున్న ప్రతి ఆసుపత్రి యాజమాన్యం విధిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో డిప్యూటీ జిల్లా వైద్యాధికారి రాజేందర్, కార్యక్రమ నిర్వహణ అధికారి నయనారెడ్డి, ఎంహెచ్ఎన్ నోడల్ ఆఫీసర్ సౌమ్య, ఐఎంఏ ప్రెసిడెంట్ రామకృష్ణ, డిప్యూటీ జిల్లా విస్తరణ అధికారి బారె రవీందర్, ప్రైవేట్ దవాఖానల గైనకాలజిస్టులు పాల్గొన్నారు.

## పల్సి హైస్కూల్‌లో బాలల కమిషన్ విచారణ

- డీఈవో, ఎంఈవోల తీరును తప్పుబట్టిన బృందం

కుభీర్, ఫిబ్రవరి 16 : మండలంలోని పల్సి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రెండు నెలల క్రితం పీఈటీ సాగర్ విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నాంటూ తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. ఈక్రమంలో 'నమస్తే తెలంగాణలో' డిసెంబర్ 24న కథనం ప్రచురితమైంది. కాగా డీఈవో, ఎంఈవో చంద్రకాంత్ పీఈటీ సాగర్‌ను డిప్యూటేషన్‌పై వేరే స్కూల్‌కు పంపించి, చేతులు దులుపుకున్నారు. ఈ క్రమంలో బాలికల తల్లిదండ్రులు రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌కు గురువారం ఫిర్యాదు చేశారు. దీంతో ఏడుగురు సభ్యులతో కూడిన విచారణ బృందం శుక్రవారం పాఠశాలలో గోప్యంగా విచారణ చేపట్టినట్లు సమాచారం. బాలికలు కంటతడి పెడుతూ టీచర్ నిర్వాకాన్ని బృందానికి వివరించినట్లు తెలిసింది. సదరు ఉపాధ్యాయుడిపై ఎంఈవో చంద్రకాంత్ డీఈవోకు క్రమశిక్షణ చర్యలకు సిఫార్సు చేయక పోవడం, ఈ క్రమంలో తనపై ఒత్తిడి తెచ్చి నోరు మెదపనీయలేదని హెచ్ఎం దొంతుల సురేశ్ విచారణ కమిషన్ ముందు అంగీకరించినట్లు తెలిసింది. కలెక్టర్‌కు నివేదిక ఈరోజే సమర్పిస్తామని బృందం సభ్యులు తెలిపినట్లు హెచ్ఎం సురేశ్ తెలిపారు.

## రైల్వేలైన్ నిర్మాణం వెంటనే చేపట్టాలి

### రైల్వేలైన్ సాధన కమిటీ ఆధ్వర్యంలో నిర్మల్ కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్‌కు వినతి

నిర్మల్ టౌన్, ఫిబ్రవరి 16 : నిర్మల్ - ఆర్మూర్ రైల్వేలైన్ నిర్మాణం వెంటనే చేపట్టాలని రైల్వేలైన్ సాధన కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్‌కు వినతిపత్రం అందించారు. ఎన్టీఆ ర్ స్టేడియం నుంచి ప్రారంభమైన ర్యాలీ కలెక్టర్ కార్యాలయం వరకు కొనసాగింది. కేంద్ర ప్రభుత్వం నిర్మల్- ఆర్మూర్ రైల్వేలైన్ నిర్మాణం కోసం హామీ ఇచ్చి మరిచిపోయింద న్నారు. నాయకులు ఎంసీ లింగన్న, పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, చంద్రగౌడ్, కృష్ణంరాజు, సాయన్న, మనోజ్‌కుమార్, జనార్దన్, శాంతి లాల్‌పటేల్, రంజిత్, మనో హర్‌రెడ్డి, మూర్తి, ఇంతియాజ్, చాంద్‌పాషా పాల్గొన్నారు.


కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న సాధన కమిటీ సభ్యులు

## మెరుగైన వైద్యమందించాలి

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా
- మందమర్రి పట్టణంలోని పాత బస్టాండ్ ఏరియాలో గల పీహెచ్‌సీ తనిఖీ

మందమర్రి, ఫిబ్రవరి 16 : ప్రభుత్వ దవాఖానలకు వచ్చే పేదలకు మెరుగైన వైద్య సేవలందించాలని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి ఖుష్బూ గుప్తా సూచించారు. శుక్రవారం మందమర్రి పట్టణంలోని పాత బస్టాండ్ ఏరియాలో గల పీహెచ్‌సీని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అన్ని విభాగాలను పరిశీలించారు. ప్రజలకు అందిస్తున్న వైద్య సేవల వివరాలను డాక్టర్ రమేశ్‌ను అడిగి తెలుసుకున్నారు. వైద్య సేవల రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వ దవాఖానలపై ప్రజలకు మరింత నమ్మకం కలిగేలా విధులు నిర్వహించాలని సూచించారు.

## నిర్మల్ డీపీఆర్వోగా విష్ణు

నిర్మల్ టౌన్, ఫిబ్రవరి 16 : నిర్మల్ జిల్లా డీపీఆర్వో విష్ణు శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ పని చేసిన తిరుమలను ఆదిలాబాద్‌కు బదిలీ చేశారు. అక్కడ పనిచేస్తున్న విష్ణును నిర్మల్‌కు బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. స్థానిక కార్యాలయంలో బాధ్యతలను స్వీకరిం చిన ఆయన జిల్లా కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు కార్యాలయం ఉద్యోగులు అభినందనలు తెలి పారు. ఈ కార్యక్రమంలో డీపీఆర్వో కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.


కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీపీఆర్వో